
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 21 డిసెంబరు 2024







- విత్తనాలు, ఎరువుల నాణ్యత తేలటం గగనమే
- ఏఓలు చెయ్యాల్సిన టెస్టులు ఏఈఓలు చేస్తున్నారు
- ల్యాబ్‌లు పెట్టిన లక్ష్యానికి తూట్లు
- ఉమ్మడి జిల్లాలోని 15 కేంద్రాల్లో అదే దుస్థితి

అగ్రీ పరీక్షలు.. అంతంతమాత్రమే

గుంటూరు సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట్లు కుమ్మరించి ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా రైతు సేవలో మునిగి తేలాల్సిన అగ్రీ ల్యాబ్‌లు వృధాగా పడివున్నాయి. విత్తనాలు, ఎరువుల నాణ్యత నిర్ధారించేందుకు అన్ని రకాల పరికరాలు ఉన్నప్పటికీ పరీక్షలు చేసే వారు లేక ఉసూరు మంటున్నాయి. నాబార్డుకు చెందిన రూ. 200 కోట్ల నిధుల తో 2021 లో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 నియోజకవర్గ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ విత్తనాలు, ఎరువుల నాణ్యతను నిర్ధారిస్తారు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తారు. ఎరువుల్లో న్యూట్రియంట్లు(పోషకాలు) , తేమ శాతం, పార్టికల్ సైజును పరీక్షిస్తారు. ఇటువంటి పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుంది. నకిలీలు, కల్తీ లకు కళ్లెం పడుతుంది.

నెలకు 80 కి పైగానే నమూనాలు...

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబ్ లకు ప్రతి నెలా 80 నుంచి 100 నమూనాలు పరీక్షల నిమిత్తం వస్తున్నాయి. వాటిని అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన వ్యవసాయ అధికారి మాత్రమే పరీక్షలు జరపాలని ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్- 1985 చెబుతోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ ల్యాబుల్లో ఏఓ లు లేరు. కేవలం ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారులు) మాత్రమే పరీక్షలు నిర్వహించి ఫలితాలు తేలుస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఇదే తంతు నడుస్తోంది.

అంతా తూతూ మంత్రం..

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ల్యాబుల్లో జరుగుతున్న విత్తనాలు, ఎరువుల

(మిగతా 8వ పేజీలో..)



ప్రత్తిపాడు అగ్రీల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఈఓ

- ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో అస్తవ్యస్తం
- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు వీల్లేదు
- ఈ-స్టాంపింగ్ విధానాన్ని రద్దు చేసే యోచన

ప్రక్షాళన దిశగా రిజిస్ట్రేషన్..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సకల వ్యవస్థలను గాడి తప్పించినట్లుగానే గత ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా భ్రష్టు పట్టించింది. ఏకపక్ష నిర్ణయాలతో సదరు విభాగాన్ని కునారిల్లేలా చేసింది. సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో ఇష్టారీతిన వ్యవహరించింది. సర్వర్ నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు కమీషన్ల కోసమే అన్నట్లు ఉన్నారు తప్పితే ప్రజల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. 2.0 పేరిట కార్డు ప్రైమ్ విధానాన్ని అమలు చేసి ప్రజలను నానా ఇక్కట్లకు గురి చేసింది. జ్యుడీషియల్ పత్రాల స్థానంలో ఈ స్టాంపింగ్ ఇలా ఒక్కటేమిటి అన్నీ అడ్డగోలు నిర్ణయాలతో సదరు శాఖను తిరోగమన బాట పట్టేలా చేసిన గత ప్రభుత్వానిది. ఇక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ అంటూ గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రహసనాన్ని తలపించింది తప్పితే ప్రజలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ఇవన్నీ ఒక ఎత్తయితే రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలను తమ అడ్డాలుగా మార్చుకుని రాజకీయ పైరవీలతో వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ఏళ్ల తరబడి ఒకే పోస్టింగ్‌లో ఉన్నవారిని కొనసాగిస్తూ ఉద్యోగుల బదిలీలను కూడా అపహాస్యం చేసిన ఘనత గత పాలకులది. వీటన్నింటి మధ్య ప్రజలు తమ హక్కుగా పొందాల్సిన రిజిస్ట్రేషన్‌ల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితిని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలను సవరించడంతో పాటు మొత్తం రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేసే చర్యలు కూటమి ప్రభుత్వంలో ఊపందుకున్నాయి. దీనిలో భాగంగా గత ప్రభుత్వం జారీ చేసిన కొన్ని ఉత్తర్వులను ఇప్పటికే రద్దుబాట పట్టించిన ప్రభుత్వం ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమయి ఉంది



దాదాపుగా ఐదు వేల రిజిస్ట్రేషన్లు....

వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు అంటూ హడావిడి చేసిన సంగతి విదితమే. ఈ విధానంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల రిజిస్ట్రేషన్లు సచివాలయాలు వేదికగా జరిగినట్లు తెలుస్తోంది. ఇక్కడ జరిగిన వాటిల్లో ఎక్కువ శాతం వైసీపీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలకు విరుద్ధంగా జరిగినవేననే ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు కూడా చాలావరకు సచివాలయాల్లోనే జరిగాయి. వీటన్నింటిపై విచారణకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ విధానానికి పూర్తిగా ఎత్తివేసి సదరు విభాగానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా అడుగులేస్తోంది

భూ దందాలకు దన్నుగా...

నిబంధనలను కాలరాసి ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో వైసీపీ నేతాగణం పోటీ పడింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఈ అడ్డగోలు రిజిస్ట్రేషన్‌ల లెక్కతేల్చాలని ఆదేశాలు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో బాపట్ల జిల్లాలో 76 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 250 ఎకరాల వరకు ఉండొచ్చనేది అంచనాగా ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వ నిబంధనలేవీ పాటించకుండా పుట్టగొడుగుల్లా గత ప్రభుత్వంలో అక్రమ లే అవట్లు వెలిశాయి. వీరి పాపాలకు రిజిస్ట్రేషన్ శాఖ కూడా తనవంతుగా సహకారం అందించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 550 లే అవుట్లను అక్రమమైనవాటిగా గుర్తించి వాటి వివరాలను ప్రజల ముందుంచింది. వీటి విషయంలో రిజిస్ట్రేషన్లు

(మిగతా 8వ పేజీలో..)



జొన్నలగడ్డ సొసైటీ భవనం

మరో ఆరు నెలలు.. అధికారుల పాలనే

- సహకార ఎన్నికలు లేవు
- ఉత్తర్వులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలకు గతంలో నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 21 నుంచి పర్సన్ ఇన్‌చార్జ్‌ల కాల పరిమితి ముగియనుండడంతో సొసైటీలకు ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరిగింది. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకపోతే త్రిసభ్య కమిటీలను నామినేట్ చేస్తారని కూడా ప్రచారం చేశారు. వీటన్నిటికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెడుతూ పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ అయా జిల్లాల సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌లు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 168 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. రైతులు ఓటు ద్వారా వారికి నచ్చిన రైతులను సంఘాలకు ఎన్నుకోవాలి. రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. వీటన్నింటికి గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను ప్రభుత్వమే నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో సొసైటీలకు ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారులకే సొసైటీల పాలనను అప్పగించింది. దీనివలన కొంత రాజకీయ జోక్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు పాలకులు సాహసం చేయకపోవడానికి సొసైటీల ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉండటమేనన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సభ్యుల పేర్లు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వీటన్నింటిని సరిదిద్దిన తరువాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

సాగర్ ప్రాజెక్టు కమిటీకి.. కూటమి అభ్యర్థుల ఖరారు

- చైర్మన్‌గా పులుకూరి.. వైస్ చైర్మన్‌గా చక్రపాణి
- పీసీ పదవి రెండు.. మూడేళ్లుగా పంపిణీ
- రెండేళ్లు పులుకూరి.. మూడేళ్లు గోగినేని
- డెల్టాలోనూ.. చెరి సగం..!
- తొలి రెండేళ్లు మురళీధరరావు
- తదుపరి మూడేళ్లు సునీల్ చౌదరి



పులుకూరి కాంతారావు | ఉప్పలపాటి చక్రపాణి | గోగినేని కోటేశ్వరరావు

(నరసరావుపేట, బాపట్ల ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ కూటమి అభ్యర్థులను తెలుగుదేశం అధిష్ఠానం ఖరారు చేసింది. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నేడు జరగనున్న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగనున్నాయి. పీసీ పదవికి టీడీపీ నేతల మధ్య పోటీ ఏర్పడటంతో అధిష్ఠానం దృష్టి సారించింది. పదవులు ఆశిస్తున్న వారితో చర్చలు జరిపింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకొని శుక్రవారం పీసీ అభ్యర్థులను ఖరారు చేశారు. పోటీ ఉండటంతో ఐదేళ్ల పీసీ పదవిని రెండేళ్లు.. మూడేళ్లుగా పంపిణీ చేసింది. తొలుత రెండేళ్లు గురజాల నియోజకవర్గానికి చెందిన కారంపూడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు పులుకూరి కాంతారావు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. తదుపరి మూడేళ్లు సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముపాళ్ల డీసీ అధ్యక్షుడు గోగినేని కోటేశ్వరరావును ఖరారు చేశారు. ఈ మేరకు ఇద్దరి మధ్య అధిష్ఠానం సయోధ్య చేసింది. తొలుత తమ నియోజకవర్గానికే పీసీ పదవి కావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ పట్టు పట్టారు. ఇరువురి మధ్య పార్టీ అధిష్ఠానం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కాగా పల్నాడు జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించగా, బాపట్ల జిల్లాకు వైస్ చైర్మన్ పదవిని అధిష్ఠానం కేటాయించింది. పర్చూరు నియోజవర్గానికి చెందిన కొనంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి పేరును ఖరారు చేశారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పీసీ ఎన్నికల కోసం జలవనరుల శాఖ ఏర్పాట్లు చేసింది. పీసీ పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అధిష్ఠానం పేర్లు ఖరారు చేయడంతో పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక లాంఛనమే. పల్నాడు జిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లా పరిధిలో 10 డీసీలు ఉన్నాయి.

డెల్టాలోనూ.. ఇద్దరికి

కృష్ణా వెస్ట్రన్ డెల్టా(కేడబ్ల్యూడీ) పరిధిలోని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. ఈ పదవి విషయంలో అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. తొలి రేండేళ్ల రేపల్లె నియోజకవర్గానికి చెందిన పంతాని మురళీధరరావు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, తదుపరి మూడేళ్ల కాకుమాను మండలానికి చెందిన సునీల్ చౌదరి వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరి నియామకానికి సంబంధించి శుక్రవారం రాత్రికే జిల్లాకు చెందిన నేతలు ఏకాభిప్రాయానికి రాగా, శనివారం ఉదయం జరిగే ఎన్నిక ఏకగ్రీవం కానుందని సమాచారం. అమర్తలూరు మండల పరిధిలోని కూచిపూడి లాకుల వద్ద ఉన్న ఇరిగేషన్ శాఖ భవనం వేదిక కానుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో ఉన్న 22 డీసీల పదవుల్లో కొలువుదీరిన వారికి శనివారం ఉదయం 7 గంటలకల్లా కూచినపూడి లాకుల వద్దకు చేరుకోవాలని ఇరిగేషన్ శాఖ సమాచారం ఇచ్చింది.

చర్చ తప్ప.. అమలు ఏదీ?

- కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల ఆగ్రహం
- ప్రొటోకాల్ మీద రగడ
- తాగునీటి సరఫరా మీద ఎమ్మెల్యేల ఆగ్రహం
- 28వ తేదీకి కౌన్సిల్ వాయిదా

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్‌లో సమస్యల మీద చర్చించడమే కానీ ఏ పనీ కావడం లేదని శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు అసహనం వెలిబుచ్చారు. మేయర్ మనోహర్‌నాయుడు అధ్యక్షతన ఉదయం కౌన్సిల్ సమావేశం జరిగింది. మొత్తం 361 అంశాలతో అజెండా రూపొందించి సమావేశం ముందుంచారు. సభ ప్రారంభం కాగానే ప్రొటోకాల్‌పై పెద్దఎత్తున రగడ జరిగింది. వార్డుల్లో జరిగే కార్యక్రమాలకు తమకు ఆహ్వానం ఉండడం లేదని వైసీపీ కార్పొరేటర్లు నిరసన తెలుపుతూ మేయర్ పోడియం ఎదుట బైఠాయించారు. సుమారు గంటన్నరపాటు కౌన్సిల్ సమావేశాన్ని నిలిపివేశారు. మేయర్ చొరవ తీసుకొని పరిస్థితులను అదుపులో తెచ్చారు.

తాగునీటి సరఫరాపై రచ్చరచ్చ...

గోరంట్ల కొండపైన నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుంది.. వాస్తవాలు చెప్పండి.. అంతేకానీ ప్రజలకు అవాస్తవాలు చెప్పి వారిని మభ్యపెట్టొద్దు అంటూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే బీ రామాంజనేయులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రశ్నించారు. నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని లక్ష్మణరావు కోరారు. దీనిపై కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, గోరంట్ల ప్రాజెక్టు వచ్చే నెలాఖరికి పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. డ్రెయినేజీలలో ఉన్న తాగునీటి పైపులను బయట బిగిస్తామని వివరించారు.

డీపీఆర్‌కు అనుమతి వచ్చింది: కమిషనర్ పులి శ్రీనివాసులు

శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌లకు అనుమతి లభించిందని కమిషనర్ తెలిపారు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్‌లతో ప్రత్యేక సమావేశం జరిగిందని తెలిపారు. ఇందులో రోడ్డు విస్తరణకు అవసరమైన 120 అడుగులు భూమిని సేకరించడం, భూమికి, భవనాలకు నష్టపరిహార ఇవ్వటం వరకు మాత్రమే జీఎంసీ పాత్రని తెలిపారు.

కౌన్సిల్ సమావేశంలో అధికారులు చెప్పే సమాధానాలు సక్రమంగా లేవని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆరోపించారు. నగరం నడిబొడ్డున ఉన్న వారికే తాగునీరు అందటం లేదని, విలీన గ్రామాలకు, శివారు ప్రాంతాలకు ఏ విధంగా తాగునీరు అందిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దీనికి అధికారుల నుంచి మౌనమే సమాధానమయింది. నగరంలో ఖాళీ స్థలాలకు మెయింటెనెన్స్ టాక్స్ విధించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. సచివాలయ ఉద్యోగులు విధుల్లో బాధ్యతారహితంగా ఉంటున్నారని, వీరికి ప్రత్యేక విధులు కేటాయించాలని ఆయన కమిషనరుని కోరారు. నగరంలో అక్రమ కుళాయి కనెక్షన్‌పై కఠినచర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సూచించారు. ఒక్క కేవీపీ కాలనీలోనే 175కు పైగా అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయని కమిషనర్ తెలపడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ వాటన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారికి జరిమానా విధించి పన్నులు వసూలు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆటోనగర్‌లో ఉన్న షాపు యజమానులకు, ప్రజలకు కుళాయి కనెక్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యంపై నిరసన...

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కొందరు సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని టీడీపీ కార్పొరేటర్లు అశోక్ యాదవ్, మీరావలి తదితరులు నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. తక్షణమే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో అనధికార హోర్డింగ్‌లపై చర్చ జరిగింది. వాటిపై కమిటీ వేసి అనధికార హోర్డింగ్‌లను తొలగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని వైసీపీ కార్పొరేటర్లు కౌన్సిల్‌లో గొడవ చేశారు. కౌన్సిల్ సమావేశం 45 రోజులకు ఒకసారి నిర్వహించుకోవాలని గతంలో తీర్మానం చేసినా అది అమలుకావడం లేదని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ మనోహర్ నాయుడు జోక్యం చేసుకొని ఈ విషయం అధికారుల లోపమే తప్ప మరొకటి లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసరావుపై మేయర్ మండిపడ్డారు. ఇకనుండి ప్రతి 45 రోజులకు కౌన్సిల్ సమావేశం పెట్టాలని తీర్మానించారు. ఈనెల 28వ తేదీన కౌన్సిల్ సమావేశాన్ని మరలా నిర్వహిస్తామని నగర మేయర్ మనోహర్ నాయుడు ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి



టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం



సచివాలయ సిబ్బందిపై చర్చ జరపాలంటూ సమావేశంలో బైఠాయించిన టీడీపీ కార్పొరేటర్లు

8

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో యువతే కీలకం
- రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ బోడపాటి తేజస్వి

బాల్య బంధనాలు
- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న బాలికా వివాహాలు
- ఆరోగ్య శాఖ రికార్డులతో వెలుగులోకి నిజాలు

స్కేటర్ జెస్సీరాజ్‌కు కేంద్ర ప్రభుత్వ పురస్కారం

6

ఆర్‌వోబీలు జిల్లా బ్రాండ్‌ను ప్రతిబింబించాలి
- డిజైన్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

క్రైస్తవ మిషనరీ స్థలం కబ్జాకు యత్నం

విజయ్ డిజిటల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



విజయ్ డిజిటల్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పాతబస్టాండు సెంటరులో విజయ్ డిజిటల్ షోరూం నిర్వాహకులు నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్‌ను ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత షోరూం నిర్వాహకులు, కూటమి నేతలు, కార్యకర్తలు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ షోరూంను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. షోరూంలో ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. షోరూం సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఫోటోలు దిగారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజల నుంచి మంత్రి లోకేశ్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో విజయ్ డిజిటల్ షోరూం అధినేతలు జవ్వాది గంగాధరరావు, ఉషాకిరణ్, జవ్వాది రాహుల్, జయశ్రీ, జవ్వాది లోహిత, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు జవ్వాది కిరణ్‌చంద్, సంకా బాలాజీగుప్తా, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్

తాడికొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 22న ఆల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. ఆనంద్ చెస్ వింగ్స్, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు రూ. 1,55,000 నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. చెస్ పోటీల్లో పాల్గొనే వారు 21వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ సీఎం. గోపినాథ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్‌దారులు బ్యాంకు ఖాతాలు మార్చుకోవాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలోని ఈపీఎఫ్ చందాదారులు తమ బ్యాంకు ఖాతాలను జాతీయ బ్యాంకులకు మార్చుకోవాలని ప్రాంతీయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఎస్‌బీఐ, యూబీఐలోకి మార్చుకోవాలని, కొన్నిచోట్ల యాక్సిస్ బ్యాంకు ఖాతాలు సరిగా పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. సమస్యలు ఉంటే 0863-2344106, 2232921, లేదా ro.guntur@epfindian.gov.in అనే మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు చీఫ్‌విప్‌గా అవకాశం ఇవ్వడంతో బాధ్యత మరింత పెరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీకి మరింత అంకితభావంతో పనిచేసి పార్టీ రుణం తీర్చుకుంటా అన్నారు. చీఫ్‌విప్‌గా అసెంబ్లీ సక్రమంగా జరగటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడం బాధాకరం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని తప్పులు చేస్తే 11 సీట్లకు పరిమితం అయ్యారో ఒకసారి ఆలోచించుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేయడం, రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేయడం తప్పా జగన్‌మోహన్‌రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. గోదావరి, పెన్నా నదులు అనుసంధానం చంద్రబాబు నాయుడు మొదలు పెడితే జగన్‌మోహన్‌రెడ్డి పనులు ఆపివేసి, నిధులు పక్కదారి పట్టించి గాలికి వదిలేశారన్నారు. వరికపుడిశల ప్రాజెక్టుకు హామీ ఇచ్చి పల్నాడు ప్రజలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడన్నారు. రాజధాని నిర్మాణం గాలికి వదిలేశారని, పోలవరం చంద్రబాబు నాయుడు 72 శాతం పూర్తి చేస్తే మిగిలింది జగన్ ఎందుకు చేయలేక పోయారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కోసం రూ.33,138 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు చంద్రబాబు నాయుడు పెట్టిన మధ్యాహ్న భోజనం వైసీపీ ప్రభుత్వం ఎందుకు ఆపేసిందో చెప్పాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మళ్లీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రెండేళ్లలో గోదావరి, పెన్నా అనుసంధానానికి బాటలు వేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసే ప్రతిరైతుకు బీమా వర్తింప చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి



జిల్లా స్థాయి కమిటీతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేస్తున్న ప్రతిరైతుకు లబ్ధి చేకూరేలా బీమా పథకాన్ని వర్తింప చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులను లబ్ధిదారులుగా చేర్చే విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బాపట్ల జిల్లాలో 1.40 లక్షల మంది ఉన్నారన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు 23 వేల మంది ఉన్నారన్నారు. రైతులే ప్రీమియం చెల్లించేలా చైతన్య పర్చాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల కోసం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీమా పథకాల నమోదు కోసం జిల్లాలో 247 కామన్ సర్వీస్ సెంటర్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రస్తుతం 412 హెక్టార్లకు 414 మంది రైతులు మాత్రమే బీమా పథకం ప్రీమియం చెల్లించారన్నారు. రైతులంతా ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయశాఖాధికారులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 7 పంటలకు బీమా అమలౌతుందన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, సీపీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం శివకృష్ణ, టాటాఏఐజీ ఏజెన్సీ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీలు జిల్లా బ్రాండ్‌ను ప్రతిబింబించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- డిజైన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ వీక్షణ



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ డిజైన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై కన్సల్టెంట్ రూపొందించిన డిజైన్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. కన్సల్టెంట్ మొత్తం రెండు డిజైన్లను రూపొందించి రోడ్లు, భవనాల శాఖకు అందజేయగా ఆ శాఖ అధికారులు వాటిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు నివేదించారు. ఒక డిజైన్ హిందూ కళాశాల సర్కిల్ నుంచి అరండల్‌పేట 10వ లైను వరకు, మరో డిజైన్ సర్కిల్ నుంచి 100 మీటర్ల నుంచి ప్రారంభమయ్యేలా రూపొందించారు. దాదాపు కిలోమీటర్ పొడవునా బ్రిడ్జి ఉండేలా డిజైన్‌లు తయారు చేశారు. వాటిని శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేస్తూ నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలన్నారు. అలానే ఐకానిక్ ఆర్కిటెక్చర్‌ని ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా..

ఆర్‌వోబీ డిజైన్, పిల్లర్ల నిర్మాణం, సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిపై డిజైన్లు నూతనంగా ఉండాలన్నారు. ఐకానిక్ డిజైన్‌తోపాటు పిల్లర్లపై జిల్లా బ్రాండ్ ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జన్సీ విభాగం వద్ద అంబులెన్స్‌లకు ఇబ్బంది లేకుండా డిజైన్ రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా అండర్‌పాస్‌లు ఉండాలన్నారు. మహిళా కళాశాల రోడ్డు నుంచి బ్రిడ్జి అండర్‌పాస్ వైపునకు వచ్చే ట్రాఫిక్‌కు అనుగుణంగా కొన్ని మార్పులు చేయాలని సూచించారు. దీనికోసం మహిళా కళాశాల రహదారిపై ప్రయాణించే వాహనాల ట్రాఫిక్‌పై 24 గంటలు సర్వే చేసి డిసెంబరు 24వ తేదీ నాటికి నివేదిక అందించాలన్నారు. ట్రాఫిక్ సర్వే నివేదిక ఆధారంగా డిజైన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్, ఈఈలు విశ్వనాథరెడ్డి, చిన్నయ్య, నగరపాలకసంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రెహమాన్, రైల్వే డీఈఎన్ భరత్‌కుమార్, కన్సల్టెన్సీ ప్రతినిధులు నరేంద్ర, ప్రణీత్, సిటిజన్స్ ప్రతినిధి కుటుంబరావు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ డెడ్ లైన్లు ఇలా...

- డిసెంబరు 31 నాటికి భవనాల విలువ లెక్కించడాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పూర్తి చేయాలి. రోడ్లు, భవనాల శాఖ టెక్నికల్ శాంక్షన్ ఇవ్వాలి.
- జనవరి 31 నాటికి విద్యుత్ స్తంభాలు, తీగెలు, వాటర్ పైపులైన్లు వంటివి షిఫ్టింగ్ చేయాలి.
- ఫిబ్రవరి 28 నాటికి 120 అడుగుల రోడ్డుని జీఎంసీ రోడ్లు భవనాల శాఖకు స్వాధీనం చేయాలి.
- ఫిబ్రవరి 28న టెండర్ల ప్రాసెసింగ్ చేపట్టి కాంట్రాక్టర్ ఎంపిక జరగాలి.

స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థల అభివృద్ధి చెందుతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు శుక్రవారం పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ (ఏసీసీఏ) ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ (ఐఎఫ్ఆర్‌సీ) అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాధర్ రావు మాట్లాడుతూ ఆర్థిక నివేదికలు, ఆదాయ వ్యయాలను అంచనా వేసుకొని మార్కెట్‌కు అనుగుణంగా మార్పులు చేర్పులు, అంచనాలు వేసినప్పుడే ఆయా సంస్థల మనుగడ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిపుణులు అందించే వివరాలను అందిపుచ్చుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానాభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో ఉండటం గొప్ప విషయం అన్నారు. ముంబాయికి చెందిన ఏసీసీఏ ప్రతినిధి జహీర్ సయ్యద్ మాట్లాడుతూ వ్యాపార సంస్థలు ఆర్థిక నివేదికల సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. 100 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలు తప్పనిసరిగా ఐఎఫ్ఆర్ ఎస్ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. చెన్నైకు చెందిన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ ప్రతినిధి రాయిస్టన్ ఎబినేజర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మార్కెట్ అంచనాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కామర్స్ విభాగాధిపతి ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ మాట్లాడుతూ కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ ఏ. కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కె.సుధీర్ కుమార్, చంద్రబాను రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైస్తవ మిషనరీ స్థలం కబ్జాకు యత్నం

- అడ్డుకునేందుకు యత్నించిన వారికి బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్‌రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న సుమారు నాలుగు ఎకరాల్లోని ఈ సంస్థ స్థలం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.50 కోట్ల వరకు ఉంది. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 46వ డివిజన్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆరికట్ల శ్రీనివాసరెడ్డి ఈ స్థలంపై కన్నేశారు. అయితే డెహ్రాడూన్‌లో ఉన్న న్యూ లైఫ్ సంస్థ ఛైర్మన్ హెలీనాను సంప్రదించి ఈ స్థలాన్ని కారు చౌకగా కొనేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. వాస్తవానికి ఆ సంస్థ బై లా ప్రకారం ఈ స్థలాన్ని ఎవరికీ అమ్మడం గానీ, కొనుగోలు చేయడం గానీ చెల్లదని, అనాథ శరణాలయం, హాస్టల్, స్కూలు, చర్చి వంటి వాటిని సంస్థ నిర్వహించలేని పక్షంలో మరో సంస్థకు అప్పజెప్పే విధంగా బైలాలో ఉన్నట్లు పూర్వ విద్యార్థులు అంటున్నారు. అంతేగాక శ్రీనివాస్ రెడ్డి వద్ద ఎటువంటి ఒప్పందం ఉందో కూడా తమకు తెలియదనీ, ఎవరికి చూపలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని విద్యార్థులు అంటున్నారు. సంఘటనపై పూర్వ విద్యార్థి యాజలి సుధీర్ నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటాం

న్యూ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న చర్చిని కూల్చి వేయడం విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించి కూల్చిన చర్చిని పరిశీలించారు. సంస్థ స్థలాన్ని, అందులోని చర్చిని కొనసాగించే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

తక్షణమే అరెస్టు చేయాలి

చర్చిని కూల్చి వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ ఛైర్మన్ మద్దిరాల ఇమ్మానియేల్ అన్నారు. సంస్థ నిర్వాహకులకు కూడా దానిని విక్రయించే అధికారం లేదనీ, విక్రయించినా అది చెల్లదని ఆయన స్పష్టం చేశారు. అర్ధరాత్రి చర్చిని కూల్చివేయడం దారుణం అన్నారు. ఈ ఘటనపై పూర్వ విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ కలిగి ఉండాలి

- మంత్రి నారా లోకేశ్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మంత్రి లోకేశ్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. 2019 నుంచి మంగళగిరిలో తన ప్రయాణాన్ని ప్రారంభించానని, అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. వైఫల్యమే విజయానికి సోపానంగా నిలుస్తుందని, అందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. వందేళ్ల స్వతంత్ర భారత్ దిశగా పయనిస్తున్న తరుణంలో 2047 నాటికి ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అందుకు యువత తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. తొలుత కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్ బాల బొల్లినేని, కళాశాల డైరెక్టర్ యూ.శౌరీలు, కరస్పాండెంట్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్నను దర్శించుకున్న అశోక గజపతిరాజు



ఆలయ సందర్శనలో కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు గల దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతి రాజు శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం దశావతార వేంకటేశ్వర స్వామికి, మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన్ను శేషవస్త్రాలతో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడంలేదని ఆత్మహత్యాయత్నం

చుండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదంటూ కౌలురైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన చుండూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కౌలు రైతు వెనిగళ్ల సాయి దేవదాయ శాఖకు చెందిన ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. తేమశాతం ఎక్కువగా ఉండటతో గత కొద్ది రోజులుగా కూలీల చేత ఆరబెట్టి లాటు కట్టాడు. శాంపిల్స్ తీసి అధికారుల వద్దకు తీసుకు వెళ్లగా కొనుగోలు చేస్తామని చెప్పి, తిరిగి మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని కొనుగోలు నిలిపి వేశారు. దీంతో తీవ్రంగా నష్టపోతానన్న బాధతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. తిరిగి కొంత సమయానికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి వైర్లు తాకడానికి ప్రయత్నించడంతో స్థానికులు కర్రలతో నెట్టి వేయడంతో కింది పడి గాయాల పాలయ్యాడు. ఇరుగుపొరుగు వారు అతనిని ఆటో ఎక్కించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మెటల్ లారీలకు రూ.36 వేలు జరిమానా

యడ్లపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అనుమతులు లేకుండా మెటల్, గ్రానైట్ తరలిస్తున్న వాహనాలను మైనింగ్‌శాఖ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గురువారం రాత్రి మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మైనింగ్ అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్‌ల నుంచి మెటల్ రవాణా చేస్తున్న 6 లారీలను అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్లు ఏఎంఆర్ సంస్థ జారీ చేసిన రవాణా బిల్లులు ఉన్నాయనీ, తమ లారీలను ఎందుకు అడ్డుకున్నారంటూ మైనింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. క్వారీల నుంచి క్రషర్‌లకు రవాణా చేసే ముడి మెటల్‌కు మాత్రమే ఏఎంఆర్ సంస్థ నుంచి బిల్లులు తీసుకుని తోలుకోవాలని, క్రషర్ నుంచి మెటల్‌ను రవాణా చేసేందుకు మైనింగ్‌శాఖ నుంచి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలన్నారు.

ఆర్నెల్ల కిందటే చెప్పాం...

ఈ విషయాన్ని ఆర్నెల్ల కిందటే క్రషర్ యజమానులకు తెలియజేశామనీ, అయినా వారు ఆన్‌లైన్ బిల్లులు తీసుకోవడం లేదన్నారు. ఆన్‌లైన్ బిల్లులు చూపితేనే వదులుతామనీ, లేకుంటే అపరాధ రుసుం చెల్లించి లారీలను తీసుకెళ్లాలని అధికారులు తేల్చి చెప్పారు. లారీ యజమానులకు, మైనింగ్ అధికారులకు మధ్య వాదన జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. క్రషర్ యజమానులను రప్పించి లారీల్లోని మెటల్ పరిమాణం ఆధారంగా అపరాధ రుసుం విధించారు. ఒక్కొక్క లారీకి రూ.6వేల చొప్పున రూ.36 వేలు జరిమానా చెల్లించి లారీలను తీసుకెళ్లారు. కాగా సరైన అనుమతి పత్రాలు లేకుండా ఫిరంగిపురం నుంచి గ్రానైట్ లోడుతో వెళ్తున్న ట్రాలీ లారీని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీలలో మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 577.80 అడుగులు ఉంది. ఇది 276.66 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 18,900 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,966 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,966 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101.109.120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00


53,675 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 46,813 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,675 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	13800	334	8000	13500
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8500	14000
273	9000	11500	273	10000	11000
341	8000	15000	341	8000	13300
4884	11000	13500	4884	8000	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	10300
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	9500



In Memoriam



Om Sri Sai Ram

1940-2024

Sri Kovelamudi Narayana Rao Garu

President of Sri Sathya Sai Seva Organisations
(Call Gas)

Sri Kovelamudi Narayana Rao Garu
has merged into Bhagavan Sri Sathya Sai Baba vaaru.
He dedicated his life to the service of mankind.

With profound grief, we inform you of the sad demise of our beloved father, Sri Kovelamudi Narayana Rao, on Friday, 20th December 2024. He has been a statesman of great standing, an entrepreneur of repute, a philanthropist par excellence, an avid educationist, and a man of many capabilities and interests.

His last rites will be performed in Prashanthi Nilayam, Puttaparthi, Andhra Pradesh, as per his wishes.

Kovelamudi Ravindra (Nani)
Guntur

స్వర్ణాంధ్ర సాధనలో యువతే కీలకం



మాట్లాడుతున్న తేజస్వీని

- రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ బోడపాటి తేజస్వీని
- హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

గుంటూరు (విద్య), డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో 60 శాతంపైగా ఉన్న యువత, విద్యార్థులు స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో కీలకం కావాలనీ, అకుం ఠిత దీక్షతో పాలుపంచుకోవాలనీ, ఇందుకు చదువు తోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలను ఉపయోగిం చుకోవాలని రాష్ట్ర సృజనాత్మ కత, సాంస్కృతికవిభాగాల కమిషన్ చైర్ పర్సన్ బోడపాటి తేజస్విని అన్నారు. గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు "ఆదర్శ్ 2024 స్పోర్ట్స్ ఫర్ హార్మనీ"ను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. తేజస్విని తొలుత క్రీడోత్సవ పతాకాలు ఆవిష్కరించిన అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పావురాలను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు.


కబడ్డీ ఆడుతున్న తేజస్వినీ

అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తేజస్విని మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా అంతర్జాతీయ ఒలింపిక్స్ దేశంలో త్వరలో నిర్వహించుకోబోతున్న సందర్భంగా ప్రధాని మోడీ ఆశిస్తున్న అత్యున్నత క్రీడా ప్రమాణాలతో కూడిన క్రీడాకారులు తయారవ్వాలని కోరారు. క్రీడాకారులు, యువతరం డాక్టర్ అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, పీవీ సింధు, హారిక లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించి తేజస్విని స్వయంగా ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఘనత వహించిన రమణరావు, ఎమ్మెస్కే ప్రసాద్ లాంటి జాతీయస్థాయి క్రీడాకారులు హిందూ విద్యా సంస్థలలో పూర్వ విద్యార్థులేనన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న క్రీడోత్సవాలకు 25 కళాశాలల నుంచి 500 మంది ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్ మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడలతోపాటు వారి మానసిక వికాసానికి దోహదపడే సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, డాక్టర్ కొల్లా సుస్మితా చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కోసూరి రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని నృత్య ప్రదర్శన


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న తేజస్వీని



విద్యార్థినీ, విద్యార్థుల మైమ్ ప్రదర్శన

ప్రక్షాళన దిశగా రిజిస్ట్రేషన్!

(5వ పేజీ తరువాయి..)

కూడా నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని రిజిస్ట్రేషన్ శాఖ చెప్పడం కొంత గందరగోళానికి దారి తీస్తోంది

నకిలీ వీలునామాలతో ఎంతో మందిని బాధితులుగా..

నకిలీ వీలునామాలు సృష్టించి ఎంతోమందిని ఆస్తి వివాదాలలోకి లాగి ఆపై వారే సెటిల్మెంట్ చేసే దందాలు గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగాయి. తమ అడుగులకు మడుగులొత్తే సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా ఈ అడ్డగోలు వ్యవహారాలను వైసీపీ నేతాగణం పెద్ద ఎత్తున నడిపించింది. ఇలాంటి వాటికి గత ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల సంఖ్యే దాదాపు 180 వరకు ఉన్నాయంటే ఏరీతిన సదరు విభాగాన్ని భ్రష్టుపట్టించారో అవగతమవుతోంది. ఈ నకిలీ వీలునామాలపై వచ్చిన ఫిర్యాదులతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన వారి వివరాలు, వాటిలో సహేతుకత ఎంత అని తేల్చే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమయి ఉంది. ఇది పారదర్శకంగా జరిగితే ఎంతో మంది బాధితులకు ఊరట చేకూరడంతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ప్రక్షాళనలో గొప్ప అడుగుకు శ్రీకారం చుట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది

ఈ-స్టాంపింగ్‌పై పునరాలోచన..

కొన్ని దశాబ్దాలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతరత్రా వ్యవహారాలకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వం వాటిని తెప్పించలేని దురవస్థలో ఈ -స్టాంపింగ్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకుని ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఈ విధానంపై అప్పట్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం ఖాతరు చేయకపోగా మొండిగా ముందుకే వెళ్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది కాకపోతే ఇస్టాంపింగ్ రద్దుపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

మార్కెట్ విలువ పెంపులో ఏకపక్షంగా..

రిజిస్ట్రేషన్ శాఖను కేవలం ఆదాయ వనరుగానే చూసిన గత ప్రభుత్వం ఎక్కడా పారదర్శకతకు అవకాశం లేకుండా ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగానే భూముల, భవనాల విలువను బహిరంగమార్కెట్‌కంటే రెండుమూడు రెట్లు అమాంతం పెంచి ప్రజల నడ్డి విరిచింది. ఈ రూపేణా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖకు దక్కిన అదనపు ఆదాయం అక్షరాల రూ.250 కోట్లకు పైమాటే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచే ఆలోచన చేస్తుంది. కాకపోతే సవరించిన విలువలను సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో రెండు వారాల పాటు ఉంచి ప్రజల అభిప్రాయం కూడా తీసుకెళ్లాలన్న తలంపులో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. మార్కెట్ విలువ పెంపుపై ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలకు కూడా తగు ప్రాధాన్యమిచ్చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది

అవినీతి కూపాలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..

ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఏ ఒక్క వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతికి కేరాఫ్‌గా మారాయి. వీటిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే ఈ అవినీతి చిట్టాలకు అంతే ఉండదు. ఏసీబీ దాడుల్లో ఎక్కువ శాతం పట్టుబడేది రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులే కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఏసీబీ కోరలు కూడా దాదాపుగా పీకేసి మొక్కుబడి సోదాలు తప్ప చిత్తశుద్ధితో పనిచేసిన దాఖలాలు లేవు. గడచిన ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏసీబీ దాడుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టుబడిన రిజిస్ట్రేషన్ సిబ్బంది 15కులోపుగానే ఉండడం ఏసీబీ అధ్వాన పనితీరుకు అద్దం పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్య మివ్వాలని భావిస్తోంది. దానిలో భాగంగా తొలుత ఆయా కార్యాలయాల్లో ఉన్న అవినీతి తిమింగలాల జాబితాను తయారు చేసే పనిలో ఉంది. త్వరలోనే వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతో పాటు సిబ్బంది విషయంలో కూడా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టనుంది.

నాలుగుపళ్ల విభాగంలో
ప్రకాశం జిల్లా ఎడ్ల జత ప్రథమం

- కొనసాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

గురజాలటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని గురజాల పట్టణంలోని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో శుక్రవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4780.7 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది.

అలాగే పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చాగంటి శ్రీనివాసరావు ఎడ్లజత 4600 అడుగులతో సంయుక్తంగా రెండోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 4230.10 అడుగులతో మూడోస్థానం, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన వీరంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఎడ్లజత 4024.8 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3933.3 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి.


నాలుగుపళ్ల విభాగంలో ప్రథమస్థానం సాధించిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

స్కేటర్ జెస్సీరాజ్‌కు
కేంద్ర ప్రభుత్వ పురస్కారం

- ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్ర మంత్రి లోకేశ్

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డు లభించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనుంది. జెస్సీరాజ్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి ఆసియా కప్, ప్రపంచ కప్ పోటీల్లో రాణిస్తూ దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసింది. ఇప్పటివరకు 50 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానిక్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. జెస్సీరాజ్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను ప్రతి ఏటా దేశంలోని 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. వివిధ అంశాల్లో విభిన్న ప్రతిభ చూపిన చిన్నారులను జ్యూరీ పారదర్శకంగా ఈ పురస్కారానికి ఎంపిక చేస్తుంది. 2025 సంవత్సరానికి సంబంధించి కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాబితాను ప్రకటించింది. క్రీడా విభాగంలో జెస్సీ రాజ్ పేరును ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ జెస్సీరాజ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఈ ఏడాది కేంద్ర బాల పురస్కార్‌కు జెస్సీరాజ్‌ను ఎంపిక చేయాలని కోరుతూ మంత్రి లోకేశ్ కేంద్రానికి లేఖ రాశారు. మంత్రి లోకేశ్ చొరవతో కేంద్రం ఈ అవార్డుకు ఎంపిక చేసిందని జెస్సీరాజ్ తల్లిదండ్రులు రాధ, సురేష్ తెలిపారు.


మంత్రి లోకేశ్‌తో జెస్సీరాజ్



పద్దెనిమిది ఏళ్లంటే ఏమీ తెలియని వయస్సు. ఆ వయస్సులోనే జిల్లాలోని బాలికలు భార్యలు వుతున్నారు. పద్దెనిమిది నిండే సరికి చంకలో ఓ బిడ్డ, కడుపులో మరో బిడ్డతో ఉసూరుమంటూ కన్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా జరుగుతున్న బాల్యవివాహాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఊరు, వాడా తేడా లేకుండా ఆడపిల్లలకు సరైన వివాహ వయస్సు రాకుండానే పెళ్లిళ్లు చేస్తున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఈ తరహా బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

బాల్య బంధనాలు

- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న బాలిక వివాహాలు
- 291 మంది బాలికలు 18 ఏళ్ల లోపే గర్భవతులు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కాకి లెక్కలు
- ఆరోగ్య శాఖ రికార్డులతో వెలుగులోకి నిజాలు

గుంటూరు సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే లెక్కకు మించిన సంఖ్యలో బాలికలు గర్భవతులు అవుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ చెబుతుంది. 15 సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాలలోపు గర్భం దాల్చిన వారి సంఖ్య జిల్లాలో రికార్డు స్థాయిలో ఉండటం విశేషం. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్రం బాల్యవివాహాలు అరికడుతున్నట్లు కాకిలెక్కలు చెబుతోంది. బాల్యవివాహాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ లెక్కకు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కకు పొంతన ఉండటం లేదు.

ఆధార్‌తో అసలు లెక్క...

గర్భవతుల నమోదుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుంది. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు కొత్తగా వివాహమైన జంటను ప్రతిరోజూ పర్యవేక్షించి నెల తప్పిన వారిని ఏఎన్ఎం దగ్గరకు తీసుకొస్తారు. అక్కడ తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరం గర్భవతిగా నమోదు చేస్తారు. అందుకోసం ఆధార్ కార్డును తీసుకుని అందులోని వివరాలనే ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆవిధంగా నమోదు చేయడం ద్వారా జిల్లాలో చిన్న వయస్సులోనే గర్భవతులు అయిన వారి వివరాలు వెల్లడవుతున్నాయి. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు నెల వరకు 291 మంది బాలికలు 18 ఏళ్లలోపే గర్భందాల్చారు. 15 ఏళ్లకే గర్భం దాల్చిన వారు 8 మంది, 16 ఏళ్లకు 24 మంది, 17 ఏళ్లకు 103 మంది, 18 ఏళ్లకు 155 మంది గర్భం దాల్చారు. వీరంతా ప్రస్తుతం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీకాలు పొందుతున్నారు.

పొంతనలేని లెక్కలు...

జిల్లాలో జరుగుతున్న బాల్య వివాహాలపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కూడా కొన్ని లెక్కలు సిద్ధం చేసింది. కానీ అవేవీ వాస్తవానికి దగ్గరగా లేవు. బాల్య వివాహాలు తాము నిలిపివేయించినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేనట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 35 బాల్య వివాహాలు నిలుపుదల చేసినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఆ శాఖకు చెందిన ఆరు ప్రాజెక్టులకుగానూ పొన్నూరు, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోనే ఎక్కువ బాల్యవివాహాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. ఉదాహరణకు పెదనందిపాడు మండలం ఉప్పలపాడుకు చెందిన బాలికకు వివాహం జరుగుతుండగా ఆపివేసినట్లు రికార్డులో చూపించారు. వాస్తవానికి ఆ బాలికకు వివాహం జరిగింది. గుంటూరు నగర పరిధిలోని మరో బాలిక వివాహం అడ్డుకున్నట్లు చెబుతున్నా, ఆ బాలికకు కూడా వివాహం జరిగింది. ఆ శాఖ చెప్పిన చాలా మంది బాలికలకు వివాహాలు జరిగిపోయాయి.






అన్నీ ఇబ్బందులే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న వివరాల ప్రకారం 15 నుంచి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు, బాలికల మరణానికి గర్భం దాల్చటమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ వయస్సులో పెళ్లి, గర్భం అంటే ఆడపిల్ల జీవితానికి బలవంతపు మరణ శాసనం రాసినట్లు భావించాలి. ఎదిగీ ఎదగని వయస్సులో బిడ్డలకు జన్మనివ్వటం వలన అనేక రకాల భౌతిక, మానసిక, ఆరోగ్య సమస్యలు బాలికలను చుట్టుముడుతున్నాయి. అందువల్లే బాల్యవివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వం 2006లో ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. అయినా బాల్యవివాహాలు ఆగకపోవటం సామాజిక సమస్యగా పరిణమిస్తోంది.

పాఠశాల స్థాయిలోనే జరుగుతున్న ప్రేమ వ్యవహారాల వల్ల జిల్లాలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో జరిగిన అనేక బాల్యవివాహాల నేపథ్యం ప్రేమ వ్యవహారమే కనిపిస్తుంది. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత వంటివి బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నాయి.



అగ్రీ పరీక్షలు.. అంతంత మాత్రమే

(5వ పేజీ తరువాయి..)

సామర్థ్యం పరీక్షల పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఏఓ చెయ్యాల్సిన పరీక్షలను ఏఈఓలతో చేయించి తూతూమంత్రంగా రిపోర్ట్‌లు ఇస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.

వృథా ప్రయాస...

ల్యాబుల్లో లర్హత కలిగిన అధికారులను నియమించకపోవటం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయిలో చేస్తున్న తనిఖీలు కూడా అభాసు పాలవుతున్నాయి. వాస్తవానికి ప్రతి వ్యవసాయ శాఖ అధికారి వారి పరిధిలో ప్రతి నెలా విత్తనాలు, ఎరువులకు సంబంధించి కొన్ని నమూనాలు సేకరించాలి. సేకరించిన నమూనాలను మొదట రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడ వాటిని డీకోడ్ చేసి నియోజకవర్గ పరిధిలోని ల్యాబులకు పంపుతున్నారు.ఇక్కడ వాటికి పరీక్షలు నిర్వహించి మంచివి అని నిర్ధారిస్తేనే అమ్మకాలు జరుగుతాయి. అటువంటి కీలకమైన నిర్ధారిత పరీక్షలు కింది స్థాయి సిబ్బంది తో చేయించటం విమర్శలకు తావిస్తోంది.


మొలవక పోయినా మంచివనే రిపోర్ట్

ఈ మధ్య కాలంలో నకిలీ విత్తనాలు బెడద బాగా పెరిగిపోయింది. అటువంటప్పుడు కొన్ని విత్తనాల కంపెనీలపై అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. విచిత్రంగా ల్యాబ్ పరీక్షల్లో అవి మంచివని తేలుతుంది. ఇటువంటి రిపోర్ట్ లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. సరైన అవగాహన లేకుండానే కింది స్థాయి సిబ్బంది తో పరీక్షలు నిర్వహించి మొక్కుబడిగా రిపోర్ట్ ు ఇస్తున్నారు. కొన్ని పెద్ద కంపెనీలు నమూనాలు ఎక్కడికి వెళ్లాయో తెలుసుకొని కింది స్థాయి సిబ్బంది ద్వారా అనుకూలంగా రిపోర్టులు తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరీక్ష లపై శిక్షణ కూడా లేదు...

వాస్తవానికి ఒక వేళ ఏఈఓ లతో ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని భావిస్తే వారికి ముందుగా శిక్షణ ఇవ్వాలి. గత మూడేళ్ళుగా ఉమ్మడి జిల్లాలో అటువంటి శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు.

పరీక్షా కాలమ్




పరిశీలన, అవగాహన, సృజనతో
అత్యధిక మార్కులు సాధ్యం

'పదో తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రం సబ్జెక్టు అంటే భయపడుతుంటారు. అలాగే కొంతమంది ఈ సబ్జెక్టును చాలా తేలికగా తీసుకుంటారు. ఇది సరైన విధానం కాదు. కొద్దిగా కష్టపడితే ఈ సబ్జెక్టులో గణితంతో పాటు దీటుగా మంచి మార్కులు తెచ్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని చెబుతున్నారు బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రత్తిపాడు(గుంటూరు) స్కూల్ అసిస్టెంట్ డీ. కుసుమకుమార్.

గుంటూరు (విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రంలో ప్రధానంగా మ్యాపులు, చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం వంటి కీలక అంశాలకు సంబంధించిన పాఠాలు ఉంటాయి. విద్యార్థులు వాటి అభ్యసనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. ఒక ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం అయితే సాంఘికశాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. కొంత మందికి ఈ సబ్జెక్టు కొరుకుడు పడని విధంగానే ఉంటుంది.. అయినా కొద్దిగా శ్రద్ధ చూపితే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

- తొలుత విద్యార్థులు సబ్జెక్టు పట్ల సరైన దృక్పథం కలిగి ఉండాలి. సాంఘిక శాస్త్రంలో ప్రస్తుతం నాలుగు పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ఇందులో చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం, ఆర్థిక శాస్త్రానికి సమాన ప్రాధాన్యం ఉంది.
- ఇందులో ప్రతి అంశానికి 25 మార్కులకు ప్రశ్నలు చొప్పున మొత్తం 100 మార్కులకు పేపర్ ఇస్తారు. ముందుగా సిలబస్‌ను ఒక క్రమ పద్ధతిలో విభజన చేసి ప్రణాళికతో రివిజన్ చేయాలి.
- సెక్షన్ 1లో భిన్న రకాల బిట్స్ ఇస్తారు. ఇవి నాలుగు సబ్జెక్టు మీద ఉంటాయి. సమాచార నైపుణ్యాల పై పట్టు సాధించాలి. భూగోళం, అర్థశాస్త్రంలో చర్చించిన సమస్యలు ఉంటాయి. ఉదాహరణకు వనరులు, వాటి వినియోగం, సంరక్షించుకోవడం తదితర అంశాలు ఉంటాయి. వాటిపై పూర్తి అవగాహన ఉండాలి. ఇంకా జల వనరులు, వాటి సంరక్షణ, కాలుష్యం నుంచి రక్షించుకోవడం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- ఫలితాలు, సమస్యా నివారణలను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఉదాహరణకు భారతదేశ, ప్రపంచంలో ఉన్న సమాచారంపై ప్రశ్నలు వస్తాయి. ఆయా భౌగోళిక పటాలపై సమాచారం తో కూడిన అవగాహన ఉండాలి.
- సమస్యలను ఇచ్చి సొంతంగా ప్రతి స్పందనలను నమోదు చేయండి.. అంటే అలాంటి వాటికి సమాధానాలు ఇచ్చే విధంగా తర్ఫీదు పొందాలి. ఉదాహరణకు.. మీకు పత్తి బాగా పండింది. అయితే ధర లేదు.. మీరు ఏం చేస్తారు. వంటి ప్రశ్నలు ఇస్తారు. అంటే వ్యవసాయం, రైతుల పరిస్థితిపై అవగాహన ఉండాలి
- పట్టికలను, గ్రాఫులను ఇచ్చి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. వాటిని సరిగ్గా అర్థం చేసుకోని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జనాభా లెక్కలు, వ్యాధులు, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి. ఆర్థిక పరమైన అంశాలు వంటి పట్టికలు, గ్రాఫులు వచ్చే అవకాశం ఉంది.
- ఒక ముఖ్యమైన పేరాగ్రాఫ్ ఇచ్చి వాటిలో ముఖ్యమైన అంశాలపై కామెంట్ చేయమని అడుగుతారు. ఇలా విద్యార్థిలో సృజనాత్మకత, పరిశీలన, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ వంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నలు ఉంటాయి. ఇలాంటి సొంత ప్రతి స్పందనలపై ప్రశ్నలు వస్తాయి.
- చివరగా విద్యార్థి పరీక్షా కేంద్రంలోకి వెళ్ళగానే ముందుగా ప్రశ్నపత్రాన్ని పూర్తిగా ఒకటికి రెండుసార్లు చదువుకోవాలి. ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రావాలి. ప్రశ్న పత్రంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండాలి. జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే సరిచేసుకోవాలి



డీ సుకుమకుమార్,
స్కూల్ అసిస్టెంట్,
బివిఆర్ జడ్పీస్కూల్
ప్రత్తిపాడు (గుంటూరు)

నేడు ఎమ్మెల్యే రామాంజనేయులు రాక

కాకుమాను, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శనివారం కాకుమానులోని టీడీపీ మండల కార్యాలయంలో నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరుకానున్నారని టీడీపీ అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణ తొలగించాలి

పెదనందిపాడు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి) : రహదారి ఆక్రమణను తొలగించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెదనందిపాడు రజక కాలనీ వాసులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కాలనీలోని వీర్లంకమ్మ తల్లి దేవస్థానానికి వెళ్లేందుకు దక్షిణం వైపున 31 లింకుల దారి ఉండగా, ఆ దారి స్థలాన్ని ఆక్రమించుకొని, గేటు ఏర్పాటు చేసి, రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, దీనిపై అధికారులు విచారణ చేపట్టి, దేవస్థానానికి దారి ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ శంకరబాబుకు వినతి పత్రం అందజేశారు.

పశ్చిమడెల్టా కాల్వకు
1616 క్యూసెక్కులు

దుగ్గిరాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1616 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 68 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 63 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 10 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1326 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

725 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 20: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 725 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకే ధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 9,225, గరిష్ఠ ధర రూ.10,400, మోడల్‌ధర రూ.10,400 పలికాయి.

భూ సమస్యల పరిష్కారానికే
రెవెన్యూ గ్రామ సభలు

కాకుమాను, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మండల పరిధిలోని అప్పాపురం సచివాయం వద్ద శుక్రవారం తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభకు 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. భూ సర్వే కోసం మూడు అర్జీలు, ఆన్‌లైన్‌లో నమోదు కోసం ఆరు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'మీ భూమి మీ హక్కు' అనే పథకం పేరతో రెవెన్యూ గ్రామ సభను ప్రతి గ్రామంలో నిర్వహిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి సురేష్‌బాబు, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో సత్యానందం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా

- మంత్రి నారా లోకేశ్
- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు
- 45 అడుగుల భారీ స్టార్ ఆవిష్కరణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గాన్ని తన గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని, ప్రజలు తనపై వుంచిన బాధ్యతను తూచ తప్పకుండా నిర్వర్తిస్తానని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరి పట్టణంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బాప్టిస్టుపేట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 45 అడుగుల భారీ క్రిస్మస్ స్టార్‌ను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ కష్టాల్లో వున్న వారిని ఆదుకోవడమే క్రిస్మస్ పరమార్థమన్నారు. 2019లో మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయినా ఇక్కడి నుంచి వెళ్లిపోకుండా కసితో పనిచేశానని చెప్పారు. 2024 ఎన్నికల్లో మంగళగిరి ప్రజలు భారీ మెజార్టీతో తనను గెలిపించారని తెలిపారు. దేవుడు ఒక్కొక్కరికి ఒక్కో విధమైన పరీక్ష పెడతాడని, పరీక్షను జయించే శక్తి కూడా ఆయనే ఇస్తాడని చెప్పారు. తాను అయిదేళ్లు కష్టపడ్డానని, తనపై అక్రమంగా 23 కేసులు పెట్టారని, 226 రోజులపాటు 3,132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. కష్టాల్లోవున్న వారిని వ్యక్తిగతంగా ఆదుకోవాలని, కలిసి కట్టుగా వుంటే సమాజంలో విప్లవం వస్తుందని, 2024 ఎన్నికల్లో తాను అది చూశానని తెలిపారు. గత ఆర్నెల్ల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇళ్ల పట్టాల మంజూరు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, తాగునీరు అందించడంతోపాటు అండర్ గ్రౌండ్ పవర్, గ్యాస్ అందిస్తామన్నారు. నియోజకవర్గంలో 85 పార్కులను అభివృద్ధి చేస్తా మని, కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు.


ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్


ఏపీఎస్పీ అధికారులతో కలిసి కేకు కట్ చేస్తున్న మంత్రి నారా లోకేశ్

ఏపీఎస్పీ ఆరవ పటాలంలో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొని అధికారులతో కలిసి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 1995లో ఏపీ పోలీసులు నెంబర్ వన్ స్థానంలో వుండేవారని, గడిచిన అయిదేళ్లలో గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను వ్యక్తిగత కక్ష సాధింపుల కోసం వాడుకుందని విమర్శించారు. ఏపీ పోలీసు వ్యవస్థకు పూర్వవైభవం తీసుకు రావలసిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. రాజధానిలో వున్న ఏపీఎస్పీ ఆరవ పటాలం రాబోయే రోజుల్లో కీలకం కాబోతుందని తెలిపారు. పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, గత ప్రభుత్వ పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి మార్గదర్శనీయం

- ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, బూర్ల రామాంజనేయులు
- ప్రియదర్శినీ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు బోధనలు, ఆయన ఎంచుకున్న మార్గం ఆచరణీయమని, తోటి వారిని ప్రేమించాలన్న క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి మార్గదర్శనీయమని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని 5వ మైలు సమీపంలోని ప్రియదర్శినీ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరై తమ సందేశాలను ఇచ్చారు.

తొలుత కళాశాల ఛైర్మన్ చందు రామారావు ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ చందు రామారావుతో పాటు ప్రిన్సిపాల్ డీవీవీఎస్ ఫణి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, బూర్ల రామాంజనేయులుకు స్వాగతం పలుకుతున్న కళాశాల ఛైర్మన్ చందు రామారావు

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కాకుమాను, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలని మండల విద్యాశాఖాధికారి కే.ఎఫ్. కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని గరికపాడు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణను అలవాటు చేయించాలని సూచించారు. పాఠశాల స్థాయి విద్యలో ఎవరూ ఆగిపోకూడదని, ఉన్నత విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యావిధానంలో బోధన జరుగుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నళిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చర్చి ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం రెడ్డిపాలెంలో ధ్వంసంమైన బాల వికాస్ కేంద్ర చర్చిని శుక్రవారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరిశీలించారు. జరిగిన ఘటనపై స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన చర్చిని ధ్వంసం చేయడం బాధగా ఉందన్నారు. ఏమైనా హక్కులు ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని కానీ ఇటువంటి దౌర్జన్యకర చర్యలు పాల్పడకూడదని అన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పనిచేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ధ్వంసానికి పాల్పడిన వైసీపీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, అతని అనుచరులుపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

సమస్యలపై అర్జీలు

పెదనందిపాడు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పెదనందిపాడులో శుక్రవారం భూ సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారం కోసం 16 అర్జీలు 4 పంచాయతీరాజ్‌కు సంబంధించి, 5 గ్రామంలోని పలు సమస్యలపై అర్జీలు అందించినట్లు తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. దేశీరాజు సత్రం ఆస్థుల పరిరక్షణ కోసం పలుమార్లు అర్జీలు ఇవ్వడం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపి ఆస్థులు పరిరక్షించాలని వార్డు సభ్యులు వెలినేని శివయ్య అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాహితీమోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, వీఆర్వో అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు

నూతక్కి విద్యార్థినులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి 68వ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎ.శ్రీలక్ష్మీ, డి.షారోన్ కృపావల్లి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు బీహార్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కే.రజని నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రాజీవ్‌రత్న, ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టభద్రులతో ఆలపాటి

ఆత్మీయ సమ్మేళనం రేపు

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి పార్టీల మద్దతుతో వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులోని పట్టభద్రుల ఓటర్ల కోసం ఈ నెల 22న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలపాటి కార్యాలయ ప్రతినిధి తిలక్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏటు కూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న ఈ సమ్మేళనానికి విద్యా వంతులు, మేధావులు, పట్టభద్రులు హాజరై తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ సమస్య, నిరుద్యోగ భృతి, ఉపా ధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యపై వివిధ సంఘాల నాయకులతో చర్చించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే ప్రధాన ఎజెండాగా ఉంటుందని తెలిపారు.

26న ఎమిగోస్ వాలీబాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వాలీబాల్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో పురుషుల విభాగంలో ఎమిగోస్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కార్యదర్శి టీ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు అంద జేయనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 78937 32893 నంబరులో సంప్రదించాలని కోరారు.


ఫ్యాషన్ డ్రెస్ పోటీల్లో ఓ చిన్నారి

చిన్నారుల ఫ్యాషన్ షో ..

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రవీంద్ర భారతి విద్యాలయంలో గురు, శుక్రవారాల్లో ఫ్యాషన్ షో పోటీలు నిర్వహించారు. పాఠశాల జాబిల్లి విభాగానికి చెందిన చిన్నారులు చిత్ర, విచిత్ర వేషధారణల్లో అలరించారు. జంక్ ఫుడ్, నో ప్లాస్టిక్, పుష్ప-2, శివగామి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేమూరి డానియేల్, విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, అకడమిక్ హెడ్ రమాదేవి, జీఎం రాజేష్, జాబిల్లి ఏఓ శిరీష, హయ్యర్ ఏఓ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- అధికారులకు సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశం

తుళ్లూరు, డిసెంబరు 20: (ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు గ్రీవెన్స్ డేలో విన్నవించిన వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ. సూర్య సాయి ప్రవీణ్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కి విన్నవించుకున్నారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల్లో అధిక శాతం వాటికి అక్కడకక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన సమస్యలను పరిశీలించి వీలైనంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కమిషనర్ ఆదేశించారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని హెచ్చరించారు.

అనంతరం కమిషనర్ రైతులతో మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అమరావతిలో


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్

భూవ్యవహారాలకు సంబంధించి-45, ప్రణాళికా విభాగం -3, సామాజిక అభివృద్ధికి సంబంధించి -1 సమస్యలను గ్రీవెన్స్‌లో అదనపు కమీషనర్ వద్దకు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జీ. బీమారావు, రవీంద్ర, ఏజీ. చిన్ని కృష్ణ, పీ. పద్మావతి, కేఎస్. భాగ్య రేఖ, బి.హుస్సేన్ సాహెబ్, కె. స్వర్ణ మేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ జీవీ.రామకృష్ణన్,డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

అయ్యన్న వాగు పరిశీలన..

మండల కేంద్రం తుళ్లూరులోని అయ్యన్న వాగును సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్ శుక్రవారం పరిశీలించారు. పక్కన వేయాల్సిన రోడ్డు వివరాలు అధికారులను నుంచి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కమిషనర్‌తో మాట్లాడుతూ.. తూర్పు బజారున 100 మీటర్ల సిమెంట్ రోడ్డు వేయాల్సివుందని, అంతేగాక వాగును ఆధునీకీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సిమెంట్ రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని, డ్రెయినేజీ, వాగు రిటర్నింగ్ వాల్, రోడ్డు కలపి ఆ మొత్తం ఖర్చు అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని కోరారు. అయితే రోడ్డుకు ఒక పక్క వాగు ఉండగా మరొక పక్క కొని చోట్ల ఆక్రమించి ఉన్నట్టు తెలుస్తుంది. సర్వే చేసి పనులు మొదలు పెట్టాలని అదనపు కమిషనర్ ను స్థానికులు కోరారు. కార్యక్రమంలో సీఆర్డీఏ సామాజిక అధికారి బొర్రా శ్రీనివాసరావు. ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


అయన్న వాగు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్

పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి


సభలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

తాడేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందాలని మంత్రి సత్య కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి మండ లం ఉండవల్లి దేవునిమాన్యంలో మాదల గోవర్ధనరావు చారిటబుల్‌ట్రస్ట్, కాటూరి మెడికల్‌కాలేజీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ముగింపు సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ నారా లోకేశ్ స్ఫూర్తితో వైద్యశిబిరం ఏర్పాటుచేయడం హర్షణీయమని, మాదల గోవర్ధన్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా 30 లక్షల మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశామని, గుండె జబ్బులు ఉన్నవారికి గోల్డెన్ అవర్‌లో రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పేదలకు ఉచిత వైద్యం మీద రూ.19 వేల కోట్లు వెచ్చిం చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ పేద ప్రజలకు అడ్వాన్స్ టెక్నాలజీ వైద్యసేవలు అందించల్సిన అవసరం ఉందన్నారు. ఐదు కోట్ల జనాభాలో నిరంతరం ఆరోగ్య సమస్యలతో 1.2శాతం ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రికి వెళుతున్నారన్నారు. కాగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య సేవలు అందరికి తగినంతగా అందుబాటులో లేవని అభిప్రాయపడ్డారు. ప్రజలు కూడా ఇటువంటి వైద్య శిబిరాలను వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ డీన్ వరప్రసాద్, నియోజక వర్గ, మండల, స్థానిక నేతలు, మాదల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

తుళ్లూరు, డిసెంబరు 20: (ఆంధ్రజ్యోతి) మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో మండల కేంద్రం తుళ్లూరులో టీడీపీ నాయకులు శుక్రవారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ ఆర్థిక సహకరంతో అరివేణి వెంకట సుబ్బమ్మ, కల్లూరి ఏసుబాబు, చాదరాజుపల్లి మస్తాన్ అనే చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు, నేలపాటి విజయ, ఇక్కుర్తి ఏడుకొండలు తుళ్లూరు సామ్రాజ్యం, పోలు సుబ్బారావు, షేక్ మొహిద్దీన్, తల్లం నరసింమారావు, మల్లె శ్రీను చెరుకూరి సాంబయ్యలకు తోపుడు బండ్లు అందించాని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జమ్ముల అనిల్ కుమార్, జమ్ముల హరికిరణ్(బాబి)జమ్ముల


తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

ప్రదీప్, నేలపాటి శ్రీనివాసరావు, కంతేటి రాజేష్, మూల్పూరి రాంబాబు, పాటిబండ్ల జయకృష్ణ, ఘైనేని రామాంజనేయులు, కొల్లి నరేంద్ర, గద్దె సురేంద్ర, గూడపాటి శ్రీకాంత్, వెంకటేశ్వరావు, రమేష్, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

తాడికొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వినియోగంతో పర్యావరణానికి హాని కలుగుతుదని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం తాడికొండ మండలం రావెల గ్రామంలో లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వినియోగం, అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ అవశేషాలు భూమిని కలుషితం చేస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వలన జీవుల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయన్నారు. ర్యాలీ అనంతరం గ్రామంలో కాటన్ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసులు, కల్చరల్ విభాగాధిపతి కే.శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఫిరంగిపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని నూతన సియోన్ ప్రార్థనా మందిరం ప్రారంభం సందర్భంగా శుక్రవారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. గుంటూరు ఏఈఎల్‌సీ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జే బాబూరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు అనే బహుమానాన్ని దేవుడు ప్రపంచజనులకు వరంగా ఇచ్చారన్నారు. క్రిస్మస్ నూతన ఏడాది ఆశీర్వాదాలు భక్తులు పొందాలన్నారు. ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసిన అనంతరం నిర్మల్ హృదయ సేవాసంస్థ అనాథ బాలలకు దుప్పట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఫాస్టర్లు పల్లెప్రసాద రావు, శీలం బాబూరావు, జీ రవికుమార్, హైజక్, భాస్కర్‌రావు, గుంటూరు డిప్యూటీ బిషప్ సూర్యప్రకాష్, పుల్లా ఆదమ్స్, కే.జయరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి

చెక్కు అందజేత

తాడేపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేశ్ స్థానిక నాయకుల ద్వారా అందజేయించారు. 1వ వార్డుకు చెందిన కొక్కిలగడ్డ కనకదుర్గకు ముందస్తు చికిత్స కోసం రూ.1,05343లు, ఎల్‌వోసీ చెక్కును నేతలు ఇంటికి వెళ్లి అందజేశారు. 13వ వార్డుకు చెందిన గుద్దంటి అలేఖ్యకు రూ.18819లు విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, ఇట్టా భాస్కర్, షేక్ నాగుల్‌మీరా, మాల్యాద్రి రెడ్డి, జోజమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సభలను

సద్వినియోగం చేసుకోండి

దుగ్గిరాల, డిసెంబరు 19: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికై ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఐ. సునీత అన్నారు. మండలగ్రామం పెనుమూలిలో గురువారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో, దేవాదాయశాఖ, వక్ఫ్‌భూముల సమస్యలపై రైతులను అధికారులు అర్జీలు స్వీకరించారు.

తహసీల్దార్ మాట్లాడుతూ, అన్ని రకాల భూసమస్యలకూ, ఒకేవేదికపై పరిష్కారం అందించేందుకే రాష్ట్రప్రభుత్వం గ్రామరెవెన్యూసదస్సులు నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లోని రైతుల వద్దకే వచ్చి, సభల ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాల్లో భూమి సర్వేనెంబర్లు, అడంగల్‌లో మార్పులు, చేర్పులపై సంపూర్ణ సమాచారం ఇస్తున్నారని, అర్జీలిచ్చేందుకు ముందుకు రావాలన్నారు. భూసమస్యలకు సంబంధించి 7 అర్జీలు వచ్చాయని, దేవాదాయ, రెవెన్యూ, వక్ఫ్ తదితర మూడు శాఖల అధికారులతోపాటు సబ్‌రిజిస్ట్రార్‌కూడా హాజరవుతున్నారవుతుండటంతో నేరుగా వారితోనే సమస్యలను వివరించే అవకాశం కలుగుతుందన్నారు. సదస్సులో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికా రులకు పంపి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పలువురు స్థానిక నాయకులు నందిపాటి జోగారావు, కొరిటాల సురేష్, టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ

సీపీఎం నేతల నిరసన

పెదనందిపాడు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ నిరసనగా స్థానిక పాత బస్టాండ్ సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సీపీఎం నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని, ఆయనతో ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతృత్వంలో కేంద్రం ప్రభుత్వం భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుందని, ఇది అంబేద్కర్‌ను అవమానించినట్లేనని వారు మండిపడ్డారు. మతోన్మాద రాజకీయాలకు బీజేపీ స్వస్తి పలికి ప్రజాసంక్షేమం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొత్త వెంకటశివరావు, కాపు వెంకటసుబ్బారావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దొప్పలపూడి రమేష్‌బాబు, పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటులో అభ్యంతరకరంగా ప్రస్తావించడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగా పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. స్థానిక ఎఎల్ఈ చర్చి సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాని మాట్లాడుతూ, ప్రజలు, ప్రజాతంత్రవాదులు దీనిని ఖండించాలన్నారు. ఎన్నికలకు ముందు అంబేద్కర్ పేరు జపం చేసిన నాయకులు ఎన్నికల తర్వాత వారిపేరెత్తకూడదని చెప్పడం సబబు కాదన్నారు. అమిత్‌షా తనవ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దేటి యోహాను, గురిందపల్లి సుగ్గుణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

పెదనందిపాడు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాలను అధిగమించవచ్చునని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పది విద్యార్థులకు వీఆర్వో అనిల్ సొంత నిధులతో అందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుదని, స్టడీ మెటీరియల్ అధ్యయనం చేయడం ద్వారా అధిక మార్కులు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీదుర్గా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న జిల్లా జూడో ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా జూడో అసోసియేషన్ హడాక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న సీనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జిల్లా ఎంపికలు జరుగుతాయని కమిటీ కన్వీనర్ శ్రీహరినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి ఏఎన్‌యూలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 99898 17667, 94408 61696 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

పెదనందిపాడు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సర్దుబాటు చార్జీలు భారం నిలిపివేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పారని, దీనిని అమలు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భారీగా విద్యుత్ చార్జీలు పెంచిన సమయంలో అప్పుడు ప్రతిపక్ష పార్టీ అయిన టీడీపీ పెద్దఎత్తున బాదుడే బాదుడు అనే కార్యక్రమం చేపట్టి నాడు వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చి అదే వైసీపీ బాటలో కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివ, కాపు దామోదర్, కాపు వెంకటసుబ్బారావు, దొప్పలపూడి నాగరాజు, ఆళ్ళ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి సిటీ, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పాతమంగళగిరిలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నేత పీ.బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ వినియోగదారులపై రూ.18 వేల కోట్ల భారాలను మోపిందని విమర్శించారు. పెంచిన చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.చలపతిరావు, ఎం.రాంబాబు, యూ.సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


పాత మంగళగిరిలో స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

ముఖ్యమంత్రికి వినతి

వట్టిచెరుకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమళ్ళమూడి గ్రామంలో దీర్ఘ కాలికంగా కొన్ని అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి సహకారం అందించాలని చమళ్ళమూడి గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు యడ్లపల్లి వాణి శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే గ్రామానికిచెందిన రెండు నిరుపేద కుటుంబాలు దరఖాస్తున్న చేసుకున్న సీఎం సహాయ చెక్కులను ముఖ్యమంత్రి కార్యాలయం యడ్లపాటి వాణికి చెక్కులు అందజేశారు. త్వరలో ఆ సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదుగా ఆయా కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు.


సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న యడ్లపల్లి వాణి

అమిత్‌షా రాజీనామా చేయాలి

మంగళగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ నేత ఉసురుపాటి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యంగమే నేడు అన్ని వర్గాల ప్రజలకు రక్షణగా నిలుస్తుందని చెప్పారు. ప్రపంచం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను దేశ ప్రజలందరూ గర్హిస్తున్నారని, తక్షణమే ఆయన రాజీనామా చేసి అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఏటుకూరి విజయ్‌కుమార్, మానికొండ శ్రీధర్, గుండాల ఆనంద్, పానుగంటి సాలెంరాజు, చిలువూరు నాగరాజు, కారుమూరి బెర్నార్డ్, కే.నవీన్, శ్రీనివాసరావు, కే.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై శిక్షణా తరగతులు

తాడేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని కెఎల్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతికత మండలి వారి సహకారంతో కంపెనీలు, జాతీయ లక్ష్యాలు వికసిత్ భారత్ నిర్మాణంలో సామాజిక బాధ్యతలు అనే అంశంపైన ఆన్‌లైన్ ద్వారా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం కిషోర్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో కంపెనీల సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని కంపెనీ యాజమాన్యాలకు సూచించారు. బిబిఏ విభాగాధిపతి డాక్టర్ పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు వికసిత్ భారత్ నిర్మాణంలో తమ వంతు కర్తవ్యాలను నిర్వర్తించాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ పార్థసారధి, ప్రోవీసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఆర్ ఆర్ డి డీన్ డాక్టర్ బిటిపి మాధవ్, ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ హేమదివ్య, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ శాంతకుమారి, నైజీరియాకు చెందిన ప్రొఫెసర్ అజిత్‌కుమార్‌లతో పలువురు విదేశాలకు చెందిన పలు వర్సిటీల ఆచార్యులు పాల్గొన్నారు.


రోడ్డు మెటీరియల్‌లోని నాణ్యతను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు

రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం

- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వీ వెంకటరత్నం

వట్టిచెరుకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేమల్లెపాడు - ముట్లూరు గ్రామాల మధ్య ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రోడ్డు నిర్మాణంలో వినియోగించే మెటీరియల్ నాణ్యతను శుక్రవారం పంచాయతీ రాజ్ ప్రాజెక్టు ప్రత్తిపాడు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఇతర సిబ్బందితో కలసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో వినియోగించే ప్రతి మెటీరియల్‌లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తామని, ఆయన అన్నారు. ఇప్పటికే ముట్లూరు గ్రామం వైపు నుంచి శరవేగంగా చదును చేసిన రోడ్డు పై మెటీరియల్ డస్ట్ పరచి నీటితో కూలింగ్ చేస్తూ లేమల్లెపాడు గ్రామం వరకు వచ్చారు. శుక్రవారం ముట్లూరు గ్రామంలోని వట్టిచెరుకూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి డస్ట్ వేసిన రోడ్డు పై ఎలాంటి కుదుపులు రాకుండా ఓలెన్ జీవో టెక్స్‌టైల్ న్యూటెక్నాలజీతో తయారైన షీటును పరుస్తూ మరో వైపు ఆ షీటు పై వెట్‌మిక్స్ ఆరు అంగుళాలు ఉండే విధంగా ప్రత్యేక ట్రాక్టర్ ర్యాంపుతో చదును చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో వినియోగిస్తున్న వెట్‌మిక్స్‌ను వివిధ రూపాల్లో జల్లెడ పడుతూ మెటీరియల్ నాణ్యతను నమోదు చేస్తున్నారు.

సాంకేతికతతో ప్రగతి పరుగులు

తాడికొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచంలో సాంకేతికత అభివృద్ధి చెందుతోందని, సమాజం శరవేగంగా ముందుకు వెళ్తుందని అడిషనల్ డైరెక్టర్ జనరల్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఏపీ రవీందర్‌చౌదరి తెలిపారు. శుక్రవారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రవీందర్‌చౌదరి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లోబల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఆదాయం నాల్గు ట్రిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. అదే ఆదాయము భారతదేశంలో 2024 సంవత్సరంలో పూర్వపు 8 శాతం నుంచి 23 శాతం వరకు పెరిగిందన్నారు. సృజనాత్మకతకు చదువు తో పనిలేదని, సహకారాత్మకమైన ఆలోచనలు కల్గిఉంటే నవంబర్ వన్ స్థాయికి ఎదగవచ్చునని తెలిపారు. 2025 సవంత్సరంలో వేవ్స్ సమ్మేళనాన్ని ఫిబ్రవరి 5నుంచి 9 వరకు దేశరాజధానిలో నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ ఏ. రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న రవీందర్ చౌదరి



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

దుగ్గిరాల, డిసెంబరు 20: మండల గ్రామం పెనుమూలికి చెందిన పోనూరు నాగరాజు(26) గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా పెనుమూలి గ్రామశివారులో ఎదురుగా మరొక ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగరాజు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, బంధువులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటరవి, ప్రమాద వివరాలను తెలుసుకుని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం సరికాదని మృతుని బంధువులకు సర్దిచెప్పి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్‌గుప్తా మద్యం తాగి, మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపి నాగరాజు మృతికి కారణమయ్యాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంగళగిరి సిటీ, (ఆంధ్రజ్యోతి): చినకాకాని ఎన్నారై జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సేకరించిన వివరాల ప్రకారం... ఎన్నారై జంక్షన్ వద్ద రోడ్డు పక్కన నిలిపివుంచిన పొల్యూషన్ చెకప్ వాహనాన్ని విజయవాడకు చెందిన కారు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే వున్న తుమ్మల రాంబాబు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాంబాబును స్థానికులు మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నేడు వర్సిటీకి డీజీపీ ద్వారకా తిరుమలరావు రాక

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు శనివారం రానున్నారు. వర్సిటీ డైక్‌మన్ ఆడిటోరియంలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కే.గంగాధరరావు అధ్యక్షత వహిస్తారు.

నేడు విద్యుత్ కోత

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ, మండలంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత అమలులో ఉండనునట్లు విద్యుత్ శాఖ డీఈఈ జి శ్యామ్ కుమార్ శుక్రవారం తెలిపారు.

పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రక్తదాన అవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సాంబశివనగర్ కాలనీ ప్రైమరీ హెల్త్ సెంటర్లో శుక్రవారం రక్తదానం శిబిరం జరిగింది. ఈ శిబిరంను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘంనకు చెందిన ఉద్యోగులు, పట్టణ వాసులు 50మంది రక్తదానం చేశారు. రక్తదాతలను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి వీవీ గుప్తా, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ ఆశ్రమంలో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు వెనిగళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెనిగళ్ళ నాగ విదురేంద్ర మొదటి పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు వెనిగళ్ళ జ్యోతేంద్రనాథ్, శ్వేతప్రియ, నానమ్మ, తాతయ్యలు నారాయణ శివప్రసాద్, ఉషారాణి, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాదల కోటేశ్వరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, వైఎస్ చౌదరి, వెనిగళ్ళ గాంగేయరావు, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, యార్లగడ్డ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్‌కు అవమానం సహించరానిది'

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కరును పార్లమెంటు సాక్షిగా అవమానించేలా కేంద్ర హోంమంత్రి మాట్లాడం సహించరాని విషయమని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తూమాటి రాజారావు అన్నారు. శుక్రవారం మానవ హక్కుల వేదిక కార్యాలయంలో కుల నిర్మూలన పోరాట సమితి రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ డిసెంబరు 25వ తేదీన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల ఎదుట మనుస్మృతి పత్రాలను దహనం చేయనున్నట్లు చెప్పారు. సమసమాజ స్థాపనకు అడుగులు వేసేలా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అంబేద్కర్‌ను అమానించడం అంటే దేశాన్ని, ప్రజలను అవమానించడమేనన్నారు. తక్షణమే అమిత్‌షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మనుస్మృతి దహన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జీఎస్ రాయల్, టి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకంపై తగిన శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని తూములూరు, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యను బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అజాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ యజమానులను ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు రోడ్లను ఆక్రమించరాదని, వాహనదారులకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించరాదని అన్నారు. ప్రజల సహకారంతోనే పట్టణంలో అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సూరిబాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 58 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో జరిగిన గ్రామ సభలో 58 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మ్యుటేషన్ కోసం 28 అర్జీలు, పాస్‌పుస్తకాల కోసం 5, ఎఫ్‌లైన్ దరఖాస్తులు 18, అడంగల్ మార్పుల కోసం-1, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం-1, డిజిటల్ సంతకం కోసం 5 అర్జీలు దాఖలైయ్యాయి.

ఆక్రమణలతో కాలిబాటలా రహదారులు



పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ రోడ్డులో నిలిపిన వాహనాలతో కాలిబాటలా మారిన రహదారి

తెనాలి క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనాభా పెరిగింది దాంతోపాటే వాహనాల సంఖ్య పెరిగింది. రోడ్ల ఆక్రమణలు పెరిగిపోయాయి. చాలాచోట్ల రోడ్లు పార్కింగ్ స్థలాలుగా మారిపోవడంతో



వైకుంఠపురం మార్గంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ప్రైవేట్ దేవాలయం

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ రోడ్లు చివరికి కాలిబాటలుగా మారిపోతున్నాయి. దీంతో వాహన చోదకులు ఆ వీధుల్లోకి వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం రోడ్డు, షరాఫ్ బజారు, మెయిన్ రోడ్డు, ఆంజనేయులు పంతులు రోడ్డు, ఉప్పుబజారు మెయిన్ రోడ్డులో వాహన పార్కింగ్‌లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు రోడ్ల మధ్యకు చొచ్చుకుని వచ్చి దేవాలయాలు, చర్చిలు నిర్మించుకుని రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీటిపై అధికారులు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో పలు రహదారుల్లో ఆక్రమణలు తొలగించిన అధికారులు ఈ ఆక్రమణల పైనా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకరవ్గంలో పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పొన్నూరు పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిటీ సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని మాట్లాడుతూ భూమిపై చెడును పారదోలి మంచిని వ్యాప్తి చేయడానికి భూమిపై అవతరించిన దైవం యేసుక్రీసు అన్నారు. మంచిని, ప్రేమను బోధించి సమాజంలో రుగ్మతులను తొలగించారన్నారు. సర్వ మానవాళి సోదర భావంతో మెలగాలని సూచించారన్నారు. మానవులకు సంస్కారవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారన్నారు. యేసు బోధనలు అనుసరిస్తే సమాజంలో వైషమ్యాలు, ద్వేషాలు ఉండవన్నారు. పేదలను ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలు మార్పు కోసం కూటమి పార్టీలను ఆదరించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తామని వివరించారు. అనంతరం పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేకును కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కనపర్తి ఆశీర్వాదం దైవ ప్రసంగం చేసి బైబిల్‌లోని నీతి సూక్తులను బోధించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపించే కీస్తు బోధనలు: ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవాళిని సన్మార్గంలో నడిపించేలా ఏసుక్రీస్తు బోధించారని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరం పయనించాలని మాజీ మంత్రి, గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో తెనాలిలో పాస్టర్స్ గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్నీక్రిస్టీనా, సురేష్‌కుమార్ దంపతులతో పాటు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దైవ సహాయకులు పాల్గొన్నారు. తొలుత భక్తి పాటలను ఆలపించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి సెమీక్రిస్మస్ కేక్‌ను



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్, పాస్టర్లు

కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దైవసహాయకులకు నూతన వస్త్రాలు అందించారు. ఐటీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి పాస్టర్ మల్లవరపు విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రదర్ సాల్మన్, టీడీపీ క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కారుమూరి జక్రమలు సభాకార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో పాస్టర్లు, ప్రభువు భక్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ప్లాట్స్‌లో...

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాస్టర్ల సేవలు అభినందనీయమని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని ఇండియన్ నేషనల్ అపోస్టోలిక్ డయోసిస్ చర్చి ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా వీరవల్లి మురళి పాల్గొని ప్రసంగించారు. తొలుత క్రిస్మస్ సందేశాన్ని ఆలపించి బిషప్ ప్రభుదాసు పలువురు పాస్టర్లతో కలసి వీరవల్లి మురళి క్రిస్మస్ కేకును కట్‌చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం 300మంది పాస్టర్‌లకు నూతన వస్త్రాలు, వంట సామగ్రిని అందించి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిషప్ అన్నం ఆదాము, రెవ సాల్మన్, రెవ భానుప్రసాద్, రెవ మార్టిన్ లూథర్ బాబు, దేవజనులు, సంఘస్తులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ దంపతులు

వివా, వీవీఐటీలో...

పెదకాకాని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివా, వీవీఐటీ సంస్థలలో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీస్తు గీతాలాపన, నృత్యాలు అలరించాయి. శాంతా క్లాజ్ రూపంలో విద్యార్థుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాంతా క్లాజ్‌లు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. క్రీస్తు జననాన్ని పురస్కరించుకొని కళాశాల చైర్మన్ వాసి రెడ్డి విద్యాసాగర్, వాసిరెడ్డి అరుణ ప్రియ దంపతులు కేక్ ను కట్‌చేసి విద్యార్థులకు అందించారు. యేసు జననంపై చిన్నారులు ప్రదర్శించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సువార్త బోధకుడు ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, వివా గుంటూరు క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి వివా డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కేఎస్.రావు, వివా ప్రిన్సిపాల్ సీహెచ్, సరళ, సంధానకర్త జోతిమెటిల్డా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎంజే కళాశాలలో...

తెనాలి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళా కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ఆంథోని విన్సెంట్ కేక్ కట్ చేశారు. ప్రపంచమంతా ఆనందంగా క్రిస్మస్ జరుపుకుంటారని, ప్రేమ, శాంతి పంచినప్పుడే నిజమైన క్రిస్మస్ అని చెప్పారు. విద్యార్థులు క్రిస్మస్ నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షైనీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోస్తా తీర ప్రాంత రక్షణకు ప్రాజెక్టు రూపకల్పన

● డాక్టర్ కన్నెగంటి రమేష్

తెనాలి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోని కోస్తా తీర ప్రాంతాన్ని రక్షించేందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించామని మానవ రక్షణ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కన్నెగంటి రమేష్ చెప్పారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రక్షణ కోసం వినియోగించుకునేలా తీర్చిదిద్దేందుకు మిషన్-7516 పేరుతో ప్రాజెక్టు రూపొందించామన్నారు. ఈ ప్రాజెక్టును ఐఏఎస్ అధికారులు, మంత్రులకు సమర్పించామన్నారు. దేశంలో 7516 కి.మీ తీర ప్రాంతం ఉందని, 12మేజర్, 180 మైనర్ పోర్టులను కలుపుకుని ఓడరేవుల రక్షణకు ఈ ప్రాజెక్టు తయారు చేశామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను వివిధ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు కిరణ్‌కుమార్, గౌరి, మాజీ వైస్ చైర్మన్ కన్నెగంటి గోపీచంద్, మాజీ కౌన్సిలర్ చెరుకుమల్లి సింగారావు, బొజ్జా రవి, అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక

● మాజీ మంత్రి ఆలపాటి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముకగా ఉండి ముందుకు నడుపుతున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట ఏడో వార్డులో నిర్వాహకులు పఠాన్ జిలానీ ఖాన్, పఠాన్ ఫజల్ ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కార్యకర్తలే తమ భుజస్కంధాలపై తెలుగుదేశం పార్టీని మోస్తూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనుకడుగు వేయకుండా వాటిని ఎదుర్కొంటూ ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, మహ్మద్ ఖుద్దుస్, పలువురు వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్ పరిధిలో ఏర్పడిన చౌక దుకాణాలకు (రేషన్ షాపులకు), వివిధ రకాల కారణాలతో ఖాళీ ఏర్పడిన చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రతిపాదికన డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మండల తహసీల్దార్ గోపాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తారీకులోపు సబ్‌కలెక్టర్ లేదా తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించి అప్లికేషన్‌ను నింపి అభ్యర్థుల వివరాలను అందించాలన్నారు. అనంతరం రాత పరీక్ష, ఇంటర్వ్యూతో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, పూర్తి వివరాలకోసం సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి.. మరొకరికి గాయాలు

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని ఖాజీపేటకు చెందిన వెల్లివల మహేష్‌బాబు (23) ఓ షాపింగ్ మాల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుంటారు. గురువారం రాత్రి స్వగ్రామం నుంచి అతడి స్నేహితుడు వరుణ్ ద్విచక్రవాహనంపై తెనాలి వెళ్లి తిరిగి వస్తూ కొలకలూరు రైల్వేఫ్లైఓవర్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వెనుక కూర్చుని ఉన్న మహేష్‌బాబు వెనక్కిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న వరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ వెల్లడించారు.



మెప్మా స్టాల్స్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, తదితరులు

మెప్మా బజార్లతో మహిళల ఆర్థికస్థితి మెరుగు

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెప్మా బజార్లతో మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని అందుకే వీటిని ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో పురపాలక సంఘ మెప్మా విభాగం వారు ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ కమిషనర్ శేషన్నతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు మెప్మా ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి వద్దే ఉత్పత్తులను తయారు చేసుకొని చిన్న వ్యాపారాలు చేసుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందవచ్చన్నారు. వివిధ సహాయక సంఘ సభ్యులు ఉత్పత్తిచేసిన పిండి వంటలు, పచ్చళ్లు, ఫ్యాన్సీ వస్తువులు, బ్యాగ్‌లు, గాజుల స్టాల్స్‌ను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. స్వయం సహాయక సభ్యులు ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయిస్తున్నారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చండీ దేవసేన, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కార్గో డోర్ డెలివరీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్టీసీ కార్గో సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి: డీఎం

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సర్వీసులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజరల్ టి.అజితకుమారి సూచించారు. పొన్నూరు ఆర్టీసీ డిపోలో కార్గో డెలివరీ ప్రచార మాస ఉత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీసులు అందిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు మాస ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డోర్ డెలివరీ సర్వీసులో ఉపయోగించుకొని ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగ సందర్భంగా బహుమతులు, వస్తువులు డోర్ డెలివరీ చేసుకోవచ్చని సూచించారు. కేజీ బరువు రూ.15, 6 కేజీల వరకు రూ.25, 6 నుంచి 10 కేజీల వరకు రూ.30, 10 నుంచి 25వరకు రూ.40, 25 నుంచి 50 కిలోల వరకు రూ.50 వసూలు చేయనున్నట్లు చెప్పారు. వీటికి అదనంగా జీఎస్టీ విధిస్తామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలకు సచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న పవార్ స్వాప్నిల్ జగనాథ్

ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్‌గా పవార్ స్వాప్నిల్ జగనాథ్

తెనాలి రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెనాలి మండల ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్‌గా పవార్ స్వాప్నిల్‌జగనాథ్ (ఐఏఎస్) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జనవరి 16వరకూ మండలంలోని రెవెన్యూ పరమైన అంశాలపై శిక్షణ పొందనున్నారు. తొలిరోజు మండలంలోని బుర్రిపాలెం, హాఫ్‌పేట, కొలకలూరు, దుగ్గిరాల మండలంలోని చింతలపూడి గ్రామాల్లో పర్యటించారు. అక్కడ రైతుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చేపట్టవలసిన అంశాలపై చర్చించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సువర్ణరాజు మృతి బాధాకరం



సువర్ణరాజుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొందుగల సువర్ణరాజు మృతి బాధాకరమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు మండల మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు పొందుగల సువర్ణరాజు మృతిచెందిన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ శుక్రవారం సువర్ణరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సువర్ణరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. సువర్ణరాజుకు కూటమి పార్టీల నాయకులు ఘన నివాళి అర్పించారు.



సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్ పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

పొన్నూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ రవికిరణ్ సూచించారు. సైబర్ నేరాలపై అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్లో సంభాషించటం కానీ, వ్యక్తిగత సమాచారం పంచుకోవడం కానీ చేయవద్దన్నారు. అనుమానితులతో ఫొటోలు షేర్ చేసుకోవద్దని సూచించారు. బ్యాంకింగ్ వివరాలు గుర్తు తెలియని వ్యక్తులకు ఇవ్వద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్‌లపై వైద్య సలహాలు పాటించాలి

● మండల వైద్యాధికారి అనురుధ్

కొల్లిపర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాలు, సూచనల మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి అనురుధ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అనురుధ్ మాట్లాడుతూ బీపీ, షుగర్‌లకు ప్రతి నెల వైద్య పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రతి రోజు బీపీ, షుగర్‌లకు మందులను వాడుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం ఆషాజ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్ డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ చరిత్రహీనుడిగా మిగులుతాడు

● టీడీపీ సీనియర్ నేత వీరవల్లిమురళి

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబును చంద్రముఖితో అభివర్ణిస్తున్న జగన్ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని పిచ్చివాగుడు మానుకోకుంటే చరిత్రహీనుడిగా మిగిలిపోతావని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. వైసీపీ క్యాడర్‌ను ఉద్దేశించి చంద్రబాబు చంద్రముఖిలా మారాడని ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తే పార్టీలో గుర్తింపు వస్తుందంటూ మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మురళి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనను గుర్తిచేసుకుంటే అమరావతి రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసి మూడు రాజధానులంటూ రైతుల్లో, రాష్ట్రంలో కల్లోలం సృష్టించాడని విమర్శించారు. అభివృద్ధి సంక్షేమానికి చంద్రబాబుపాలన నిదర్శనంగా ఉందన్నారు. రాజధాని అభివృద్ధిపనులను, పోలవరం ప్రాజెక్టును సైతం పూర్తి చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చుపెట్టేలా జగన్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు.

రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసిన జగన్: కనగాల

తెనాలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పాతర వేసి తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసి, రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అరాచకాలకు అడ్డాగా మార్చిన జగన్ ఏ మొహంపెట్టుకుని కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు పిలుపునిస్తాడని టీడీపీ సీనియర్ నేత అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. చంద్రబాబును చంద్రముఖి అంటూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ క్యాడర్‌ను ప్రశంసిస్తూ తిరుగుబాటు చేయమడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి పాలనను అందిస్తున్న చంద్రబాబుపై రెచ్చగొట్టేలా మాట్లాడటం సరైన విధానం కాదన్నారు. చంద్రబాబు ప్రతిష్టను దెబ్బతీసేందుకు జగన్ పడుతున్న ఆరాటంలో ఒక్కవంతైనా ప్రజలకు మంచి చేసేందుకు ప్రయత్నిస్తే నేడు ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు

ఘనంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు



పూజలు చేస్తున్న రామానుజ దాసస్వామి

తెనాలి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్ష మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్ నుండి వీఎస్‌ఆర్ కళాశాలకు వెళ్లే మార్గంలోని ప్రాంగణంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శరణాగతి ఘోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి తిరుమంజనం, అష్టోత్తర శత నామార్చన, తిరుప్పావై, గోపూజ, కుంకుమ పూజ, తీర్థగోష్ఠి, విష్ణుసహస్రనామ పారాయణ, తిరుప్పావై ప్రవచన కార్యక్రమాలను నరేంద్ర దాసనుజస్వామి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.